సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

సోమవారం । 24 । జూలై । 2023



ఉత్సాహంగా క్రికెట్ టోర్నీ

కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ-సౌత్‌జోన్ అంతర్ జిల్లాల అండర్-19 మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగుతోంది. -8లో



రోడ్డు ప్రమాద బాధితులకు అండగా ఉంటాం

రోడ్డు ప్రమాద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆర్టీసీ చైర్మన్ ఆర్టీసీ చైర్మన్ ఎ.మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.7/24.7

జిల్లాలో ఆదివారం 24.7 - 34.7 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 7.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ముగ్గురు డీఎస్పీల బదిలీ

కడప అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా సూపర్ న్యూమరీ డిఎస్పీల జాబితాను రద్దు చేసి, ఆయా పోస్టుల్లో ఉన్న డీఎస్పీలు దాదాపు 129 మందిని బదిలీ చేస్తూ ఆదివారం డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కడపలో సూపర్ న్యూమరీ విధానంలో డిఎస్పీగా పనిచేస్తున్న ఎం.డి షరీఫ్‌ను రెగ్యులర్‌గా మారుస్తూ అక్కడే నియమించారు. ఫ్యాక్షన్ జోన్ డిఎస్పీగా పనిచేస్తున్న చెంచు బాబును తిరుపతి ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ చేశారు. కడపలో ట్రాఫిక్ డిఎస్పీగా పనిచేస్తున్న బాలస్వామిరెడ్డిని కడప స్పెషల్ బ్రాంచ్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

నేటి నుంచి వైవీయూ బీఈడీ పరీక్షలు

వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయ పరిధిలోని బీఈడీ విద్యార్థులకు ఈనెల 24 వ తేదీ నుంచి ఒకటి, నాలుగు సెమిస్టర్ల పరీక్షలు , సెకండ్ సెమిస్టర్ (బ్యాక్లాగ్) పరీక్షలు ప్రారంభమవుతాయని పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్ ఈశ్వరరెడ్డి తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు హాల్ టికెట్స్‌ను తాము చదువుతున్న కళాశాలల నుండి పొందాలని సూచించారు. పరీక్షలకు హాల్ టికెట్ తో పాటు కళాశాల ఇచ్చిన గుర్తింపు కార్డును కూడా వెంట తెచ్చుకోవాలని కోరారు. పరీక్షల నిర్వహణకు వైవీయు ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్, కులసచివులు ఆచార్య వై. వెంకటసుబ్బయ్య మార్గదర్శకంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్నారు.

29న శ్రీహరికోటకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: రాకెట్ తయారీ కేంద్రమైన శ్రీహరికోటను సందర్శించడానికి ఈనెల 29న ఆర్టీసీ బస్సులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ-1 డిపో మేనేజర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. 30న రాకెట్ లాంచింగ్ సందర్శించడానికి బస్సులు ఏర్పాటు చేశామన్నారు. 29న రాత్రి 10 గంటలకు బస్టాండు నుంచి బయలుదేరుతుందన్నారు. టిక్కెట్లు ముందుగానే రిజర్వేషన్ చేసుకోవాలని కోరారు. వివరాలకు 9959225676, 7382875034 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

గ్రాప్లింగ్ రెజ్లింగ్ జట్ల ఎంపిక



జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని నాగార్జున మోడల్‌స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. ఈ ఎంపికలను జిల్లా గ్రాప్లింగ్ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డి. సాయిసుమతి, కె. గణేష్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 29, 30 తేదీల్లో అనకాపల్లి జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అనంతరం అండర్-11, అండర్-13, అండర్-15 , సబ్‌జూనియర్ విభాగాల్లో ఎంపికలు నిర్వహించి జిల్లా జట్లను ఎంపిక చేశారు.

పల్లెకు ప్రాణం



ఇతని పేరు బి. ఏసోబు. కమలాపురం మండలం టి.చదిపిరాళ్ల ఎస్సీ కాలనీ. ఇతనికి కొంతకాలంగా బీపీ, షుగర్ వ్యాధులతో బాధపడుతున్నాడు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ నుంచి వైద్యసేవలు పొందుతున్నాడు. గతంలో ఆరోగ్య సమస్యలు తలెత్తిఏ కమలాపురం, కడప, ప్రొద్దుటూరుకు వెళ్లేవాళ్లం. ఇపుడు గ్రామంలోనే విలేజ్ క్లినిక్ ఉండటం వల్ల వ్యయ ప్రయాసాలు తగ్గాయని చెబుతున్నాడు. ఫ్యామిలి డాక్టర్ అంటూ ఇంటి వద్దకే వైద్యులు వస్తున్నారని, ఇది చరిత్రలో ఎప్పుడూ చూడ లేదని ఏసోబు సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.

గ్రామీణులు..కష్టపడి జీవనం సాగించే శ్రమ జీవులు. వారికి జ్వర మొచ్చినా.. దగ్గొచ్చినా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి లేదా పట్టణాలకు వెళ్లలేక దగ్గరలోని నాటు వైద్యుడి వద్దకు వెళ్లేవారు. వారిచ్చే మందులను వేసుకొని, అవి వికటించడంతో ప్రాణాలను నెత్తి మీదకు తెచ్చుకొనే వారు. ఇప్పుడా పరిస్థితి మారింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముందు చూపు..చొరవ కారణంగా వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. పల్లె వాసుల ఆరోగ్య సంరక్షణకు సొంత ఊర్లోనే డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు ఏర్పడ్డాయి. అనారోగ్యం పరంగా ఏ సమస్యొచ్చినా ఇవి ఆదుకుంటున్నాయి.

- చెంతనే ప్రాథమిక వైద్యం
- పల్లె జనాలకు అండగా డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్



బద్వేలు మండలం తిప్పన పల్లె గ్రామంలో వైద్యసేవలను పర్యవేక్షిస్తున్న అధికారులు

కడప రూరల్: పల్లె వాసులకు అనారోగ్య సమస్యలు వస్తే 10-15 కిలో మీటర్లకు పైగా ఉన్న దూరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, లేదా పట్టణాలకు వెళ్లాల్సి వచ్చేది. అది ఆర్థికంగా, కాస్త శ్రమతో కూడుకుంది. దీంతో వారు పక్కనే ఉన్న నాటు వైద్యుడిని సంప్రదించి, వారిచ్చే మందులను తీసుకునేవారు. ప్రాణాల మీదికి తెచ్చుకొనేవారు. ఇది గమనించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల క్రితం చారిత్రాత్మకంగా డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ప్రవేశ పెట్టారు.ఇవి పీహెచ్‌సీలకు అనుసంధానంగా పనిచేస్తున్నాయి. నాటి నుంచి స్థానికులు ఏ జ్వరమొచ్చినా..ఏదైనా అనారోగ్య సమస్యొచ్చినా చెంతనే ఉన్న క్లినిక్‌కు వెళుతున్నారు. ఇక్కడ ఉండే కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఏఎన్ఎం, డేటా ఎంట్రీ ఆపరేటర్‌లు వ్యాధిగ్రస్తులకు వైద్య సేవలు అందిస్తున్నారు. అవసరమైన వారికి ఉచితంగా వైద్య పరీక్షలను నిర్వహించి, మందులు కూడా ఇస్తున్నారు. అలాగే ఆశాలు కూడా వైద్య సేవల్లో పాలుపంచుకుంటున్నారు.



క్షేత్రస్థాయిలోనే ప్రాథమిక వైద్యం

గ్రామీణులు నేల తల్లిని నమ్ముకొని జీవించే కష్ట జీవులు. ప్రధానంగా వారంతా వ్యవసాయ కూలీలపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. ఎండనక..వాననక ఏ కాలంలోనైనా సరే శ్రమిస్తుంటారు. అలాంటి వారికి సహజంగానే జ్వరం, ఒళ్లు నొప్పులు విరేచనాలు, దగ్గు, జలుబు తదితర వ్యాధులు వస్తుంటాయి. అలాగే ఒక్కో సారి సీజనల్ వ్యాధులు కూడా చుట్టుముడుతుంటాయి. ఆ వ్యాధులన్నింటికీ వైద్య సేవలు లభించడంతో పాటు ఇక్కడ టీబీ, రక్తహీనత, ఎయిడ్స్ తదితర వ్యాధులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అనుమానితులను పెద్దాసుపత్రులకు రెఫర్ చేస్తారు.

'ఫ్యామిలీ ఫిజీషియన్'తో ఇంటి వద్దకే వైద్యం...

ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టింది. ఈ కార్యక్రమం కింద 104 సంచార వైద్యశాలలో ఆ ప్రాంతంలోని పీహెచ్‌సీకి చెందిన వైద్యుడితో పాటు ఇతర వైద్య సిబ్బంది ఒక నెలలో రెండు దపాలు ఒక విలేజ్ క్లినిక్‌ను సందర్శిస్తారు. మధ్యాహ్నం వరకు ఔట్ పేషెంట్స్‌ను పరీక్షిస్తారు. మధ్యాహ్నం నుంచి క్లినిక్ వద్దకు రాలేని వ్యాధిగ్రస్తుల ఇంటి వద్దకే వెళ్లి రోగులను పరీక్షిస్తారు. ఇక్కడ ప్రధానంగా చెప్పుకోవాల్సిన విషయం ఏమంటే ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం వల్ల నిర్వహించే పరీక్షల్లో చక్కెర వ్యాధితో పాటు బీపీ, పెద్ద జబ్బులైన క్యాన్సర్, కిడ్నీ తదితర వ్యాదులు వెలుగు చూస్తున్నాయి. దీంతో వైద్య సిబ్బంది వ్యాధి గ్రస్తులను పెద్దాసుపత్రులకు పంపిస్తున్నారు. అవసరమైన వారిని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నారు. దీంతో ప్రాథమిక దశలోనే పెద్ద వ్యాధులు తీవ్రరూపం దాల్చకముందే తగ్గిపోతున్నాయి. ఫలితంగా పేదలు మెరుగైన ఆరోగ్యంతో నిశ్చింతగా జీవనం సాగిస్తున్నారు.

ప్రైవేట్ ఆసుపత్రులకు తగ్గిన ఓపీలు....

విలేజ్ క్లినిక్‌లు రాకతో ఒక స్థాయిలో ఉండే వ్యాధి వరకు క్షేత్ర స్థాయిలోనే వైద్య సేవలు లభిస్తున్నాయి. దీంతో ప్రైవేట్ ఆసుపత్రులకు దాదాపుగా ఔట్ పేషెంట్స్ తగ్గుముఖం పట్టారు. పేరు చెప్పడానికి ఇష్టపడని ఒక ప్రైవేట్ డాక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వ వైద్య రంగం బలోపేతమైంది. ప్రజలంతా స్థానికంగా ఉన్న విలేజ్ క్లినిక్‌ల్లోనే వైద్య సేవలు పొందుతున్నారు. ఫలితంగా చాలా వరకు ప్రైవేట్ ఆసుపత్రులకు ఔట్ పేషెంట్స్ రావడం లేదని అన్నారు. ఒక విధంగా ఆ డాక్టర్ చెప్పిన మాటలు వాస్తవమే. ప్రభుత్వం వైద్య రంగానికి పెద్ద పీట వేసింది. దీంతో గతంలోని ఎన్నడూ లేని విధంగా నేడు ప్రజలు ఉచితంగా కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్య సేవలు పొందుతున్నారు. దీంతో ఇన్నాళ్లు అనారోగ్యంతో కొట్టుమిట్టాడిన పల్లెకు ప్రాణం వచ్చిందనే అభిప్రాయం సర్వత్రావ్యక్తం అవుతోంది.

జిల్లాలో డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల వివరాలు

పీహెచ్‌సీలు	51
డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు	367
ఒక రోజుకు వచ్చే ఓపీలు (పేషెంట్స్)	40 మంది
లభించే వైద్య సేవలు	12
వైద్య పరీక్షల రకాలు	14
లభించే మందులు	105



కమలాపురంలోని వైఎస్సార్ విలేజ్ క్లినిక్

ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి



డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో ప్రాథమికంగా కీలకమైన వైద్య సేవలు ఉచితంగా లభిస్తున్నాయి. గ్రామీణులు క్లినిక్‌లో లభించే వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి. ఇవి విజయవంతంగా పనిచేసేలా నితంతరం పర్యవేక్షిస్తున్నాం.

– డాక్టర్ నాగరాజు,
జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

కాఫీ ఘుమ ఘుమలు



- 1989లో హార్సిలీహిల్స్‌పై ప్రయోగాత్మక పెంపకం.. విజయవంతం
- ఆదాయంపై దృష్టి పెట్టని అటవీశాఖ

బి.కొత్తకోట:అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై చేపట్టిన ప్రయోగాత్మక కాఫీ మొక్కల పెంపకం విజయవంతమైంది. సముద్రమట్టానికి 4,141 అడుగుల ఎత్తులోని హార్సిలీకొండపై వాతావరణం ప్రత్యేకం. ఇక్కడ వన్యప్రాణులు, వివిధ జాతుల పెంపకంపై చేపట్టిన ప్రయోగాలు సత్ఫలితాలు ఇచ్చాయి. ఇందులో కాఫీతోటల పెంపకం ఒకటి. కాఫీ తోటల పెంపకం చేపట్టాలని అప్పటి పీసీసీఎఫ్ ఈశ్వర్‌రెడ్డి నిర్ణయించి విశాఖపట్నం నుంచి మొక్కలను తెప్పించారు. 1989లో తొలుత ఘాట్‌రోడ్డు రెండో మలుపు వద్ద చేపట్టగా విజయవంతమైంది. తర్వాత కొన్ని నెలలకు కొండపైనున్న అటవీ పర్యావరణ సముదాయంలో కాఫీ మొక్కలను నాటగా ఊహించని విధంగా ఎదిగి దిగుబడిని ఇచ్చాయి. ఒక్కో మొక్క కిలోకిపైగా గింజల దిగుబడి ఇస్తున్నాయి. జూలైన గింజలు పట్టి ఆగస్టులో కొమ్మలు వంగిపోతాయి. అటవీశాఖ వీటిని నిర్వహణ జోలికి వెళ్లకపోయినా నాణ్యమైన కాఫీ గింజల దిగుబడి బాగా వస్తోంది. దీనికి ఇక్కడి అతిశీతల వాతావరణం కారణం. మొక్కల దిగుబడి ప్రారంభమైన కొన్నాళ్లు కాఫీ గింజలను సేకరించిన అధికారులు తర్వాత సేకరణ వదిలేయడంతో ఎండిపోయి రాలిపోతున్నాయి. హార్సిలీహిల్స్‌పై అటవీశాఖ పెంచిన కాఫీ తోటల నిర్వహణ చేస్తే మంచి ఆదాయం వస్తుంది. వీటి పెంపకం చేపట్టిన తొలినాళ్లలో మాత్రమే అధికారులు నిర్వహణ బాధ్యతలు చూశారు. తర్వాత తోటలను పట్టించుకున్న వారు లేరు. ఇక్కడి అటవీ అతిథిగృహాల నిర్వహణ, పర్యావరణ సముదాయం పరిరక్షణ పై చర్యలు తీసుకోవడం మినహాయిస్తే కాఫీ తోటలను పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం మొక్కలకు కాఫీ గింజలు నిండుగా కాపు కాశాయి. ఇప్పటికైనా అధికారులు తోటల నిర్వహణపై శ్రద్ధ చూపాల్సివుంది.



కాఫీ మొక్కకు ఏపుగా కాసిన గింజలు

టెండర్లు నిర్వహిస్తాం

కాఫీతోటల నుంచి గింజలను సేకరించుకునేందుకు ఆసక్తి కలిగిన వారి నుంచి టెండర్లను పిలిచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే రెండు కంపెనీలు గింజల సేకరణ కోసం సంప్రదించాయి.

–పళణి వివేక్, రాజంపేట డీఎఫ్ఓ

కడపలో ఫుట్‌బాల్ ఎంపికలు



ఎంపికలకు హాజరైన క్రీడాకారులు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానంలో వైఎస్ఆర్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి సబ్‌జూనియర్ ఫుట్‌బాల్ ఎంపికలకు క్రీడాకారుల నుంచి స్పందన లభించింది. ఆదివారం ఉదయం నిర్వహించిన ఎంపికలను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) బోర్డు డైరెక్టర్ ఎం. డానియల్ ప్రదీప్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫుట్‌బాల్ క్రీడలో రాణించడం ద్వారా చక్కటి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని తెలిపారు. క్రీడాకారులకు తమవంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎస్.వి.పి. అమృత్‌రాజ్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా ఖ్యాతి చాటిచెప్పేలా క్రీడాకారుల చక్కటి ప్రదర్శన కనబరచాలని సూచించారు. జిల్లా ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి ఎం. సుధీర్ మాట్లాడుతూ ఎంపికల్లో చక్కటి ప్రతిభ కనబరచే క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపికచేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు కె. థామస్ జీవన్ బాబు, అనిల్, ఫుట్‌బాల్ శిక్షకులు హరి, సునీల్, సుబ్బయ్య, గంగులయ్య తదితరులు పాల్గొన్నారు.

దిశ యాప్‌తో బాల్య వివాహానికి బ్రేక్



బాల్య వివాహాన్ని అడ్డుకుని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న దిశ పోలీసులు

కడప అర్బన్: బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయడంలో దిశ ఎస్ఓఎస్ యాప్ ప్రధాన సాధనంగా పనిచేస్తోంది. రాష్ట్రంలో ఎక్కడ బాల్య వివాహాలు జరుగుతున్నా ప్రజలు స్వచ్ఛందంగా దిశ ఎస్ఓఎస్ యాప్‌కు కాల్ చేసి సమాచారం అందిస్తున్నారు. తాజాగా వైఎస్సార్ జిల్లా సిద్దవటం పోలీస్‌స్టేషన్ పరిధిలో బాల్య వివాహం జరుగుతున్నట్లు మైనర్ బాలిక స్నేహితులు యాప్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేశారు. నిముషాల వ్యవధిలో దిశ పోలీసులు బాలిక ఇంటికి చేరుకుని వివాహం జరుగకుండా అడ్డుకున్నారు. కేవలం రెండు గంటల వ్యవధిలో రాయదుర్గం, పెనమలూరు, ఏలూరు, కడప, నెల్లూరులో బాల్య వివాహాలు జరుగకుండా దిశ పోలీసులు వెళ్లి అడ్డుకున్నారు. దిశ యాప్ ద్వారా ఇప్పటి వరకు 34 బాల్య వివాహాలు నిలుపుదల చేసినట్లుగా దిశ పోలీసు ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. తాజాగా వైఎస్ఆర్ జిల్లా సిద్దవటంకు చెందిన మైనర్ బాలికకు ఈనెల 23 (ఆదివారం) వివాహం చేయడానికి తల్లిదండ్రులు ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని బాలిక స్నేహితులు దిశ ఎస్ఓఎస్ యాప్‌కు శనివారం తెలియజేశారు. కేవలం 8 నిమిషాల వ్యవధిలోనే బాలిక ఇంటికి దిశ పోలీసులు చేరుకున్నారు. బాలిక తల్లి దండ్రులకు దిశ టీం కౌన్సెలింగ్ ఇచ్చింది. దిశ పోలీసుల సూచనల మేరకు మరికొన్ని గంటల్లో జరిగే వివాహాన్ని రద్దు చేస్తున్నట్లు తల్లిదండ్రులు ప్రకటించారు. అమ్మాయి చదువుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు. దిశ యాప్‌కు కాల్ చేసి సమాచారం అందించిన బాలిక స్నేహితులను పోలీసులు అభినందించారు.

టీడీపీ హయాంలో అక్రమ ఆన్‌లైన్

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై, నాయకులపై విషం కక్కడమే పనిగా పెట్టుకున్న ఎల్లో మీడియా రోజురోజుకు పేట్రేగిపోతోంది. ఉచితానుచితాలను పాటించకుండా, పాత్రికేయ ప్రమాణాలు పట్టించుకోకుండా తన పచ్చ పైత్యాన్ని చూపిస్తోంది. ఎల్లాయపల్లె ఆశ్రమభూములపై వాస్తవాలు తెలుసుకోకుండా ఇతరులపై బురద చల్లేందుకు ప్రయత్నిస్తూ అక్షరాల్లో తన కడుపుమంటను బయట పెట్టుకుంటోంది.

- ఆశ్రమభూములు అన్యాక్రాంతం
- భూములపై టీడీపీ, సీపీఐ నేతల కన్ను



ఆశ్రమానికి చెందిన భూమిలో అక్రమంగా గుట్టపై తవ్విన దృశ్యం

ఓబులవారిపల్లె : 2017 సంవత్సరం తెలుగు దేశం పార్టీ హయాంలో పెద్దఓరంపాడు రెవెన్యూ పరిధిలోని ఎల్లాయపల్లె ఆశ్రమ భూములను టీడీపీ,సీపీఐ నాయకులు అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకుని కబ్జాలకు యత్నించారు.బ్యాంకుల్లో లక్షలాది రూపాయలు బ్యాంక్‌లోన్లు తెచ్చుకొన్నారు. తమ భూములను ఆశ్రమం పేరుపై ఆన్‌లైన్ చేయించాలని నిర్వాహకులు రెవెన్యూ వారిని సంవత్సరాలుగా కోరుతున్నా ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు.

- ఎల్లాయపల్లె గ్రామంలో 1982లో చిన్మయానంద స్వామి శిష్యురాలు, స్వామిని శారద ప్రియానంద దాదాపు 40 ఎకరాల విస్తీర్ణంలో చిన్మయారణ్యం ఆశ్రమాన్ని నెలకొల్పారు. ఆశ్రమ ఆవరణలో ఆ. ధ్యాత్మిక మందిరాలు, గోశాల, వృద్ధాశ్రమం, హరిహర పాఠశాల, ఆరోగ్యకేంద్రాన్ని ఏర్పాటు చేశారు.. కాలుష్య నివారణకు మొక్కలను నాటారు. అరణ్యాన్ని ఏర్పాటు చేసేందుకు 1994లో ఆశ్రమానికి అప్పటి జిల్లా కలెక్టర్ కేవీ రమణాచారి జీవో నంబర్ 6496-93 ద్వారా 2654-1, 2654-3,2649, 2650,2652 సర్వే నంబర్లలో 86.99 ఎకరాల విస్తీర్ణంలో 99 సంవత్సరాల అగ్రిమెంటుతో అప్పజెప్పడం జరిగింది. అప్పటి నుంచి నేటివరకు సంబంధిత భూమిలో ఆశ్రమ నిర్వాహకులు టేకు, ఎర్రచందనం జామాయిలు మొక్కల పెంపకాన్ని చేపట్టారు.

టీడీపీ హయాంలో అక్రమంగా ఆన్‌లైన్

ప్రభుత్వం కేటాయించిన 86.99 విస్తీర్ణంలో నాటిన మొక్కలు పెద్ద చెట్లుగా మారాయి. తెలుగుదేశం పార్టీ హయాంలో కొందరు టీడీపీ ,సీపీఐ నాయకులు ఆశ్రమానికి సంబంధించిన సర్వే నంబర్ 2652పై పడింది. రెవెన్యూ రికార్డుల పరంగా సంబంధిత సర్వే నంబర్‌లో 47 ఎకరాల భూమి మాత్రమే ఉంది. స్థానికంగా ఉన్న తెలుగుదేశం, సీపీఐ పార్టీలకు చెందిన కబ్జాదారులు 2652 సర్వే నంబర్‌లో అక్రమంగా ఆన్ లైన్ చేసుకున్నారు. మండలానికి చెందిన సీపీఐ నాయకుల కుటుంబం పేరున 2652-2,2652- 3,2652- 10,2652-7,2652- ఇ2652- ఇ1,ఐదుఎకరాలు 4.90 ఎకరాల చొప్పున సుమారు 30 ఎకరాలను అనువంశంకు చెందినదిగా ఆన్ లైన్ చేసుకున్నారు. సంబంధిత సర్వే నంబర్‌లో రెవెన్యూ రికార్డుల పరంగా 47 ఎకరాలు ఉండగా.. టీడీపీ ,సీపీఐ నాయకులు ఏకంగా 90 ఎకరాలు భూమికి అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకున్నారు. అప్పట్లో తమ భూములు చూపించాలని రెవెన్యూ అధికారులను సంప్రదించడంతో ఎల్లాయపల్లె ఆశ్రమానికి చెందిన భూములు కబ్జాలకు గురయ్యాయని వెలుగులోకి వచ్చింది. విషయాన్ని తెలుసుకున్న ఆశ్రమ నిర్వాహకులు టీడీపీ పాలనలో జన్మభూమి కార్యక్రమం, గ్రీవెన్సెల్‌లో రెవెన్యూ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అంతేకాకుండా సంబంధిత సర్వే నంబర్‌లో ఆన్‌లైన్ చేయించుకున్న వారు బ్యాంకుల నుంచి లక్షలాది రూపాయలు రైతు రుణాలను తెచ్చుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

సంవత్సరాలుగా పరిష్కారం కాని భూసమస్య

ఎల్లాయపల్లె ఆశ్రమ నిర్వాహకులు అక్రమంగా ఉన్న ఆన్‌లైన్‌లు తొలగించి తమ భూములను ఆశ్రమం పేరుపై ఆన్‌లైన్ చేయించాలని కోరుతున్నారు. కొంత మంది అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని , అప్పట్లో ఆశ్రమం వారు ఏర్పాటు చేసిన కంచెను తొలగించి చెట్లను నరికివేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. దాదాపు ఆరు సంవత్సరాల నుంచి సమస్య పరిష్కరించాలని అనేక సార్లు రెవెన్యూ అధికారులను సంప్రదించినా కూడా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదికలు



ఎల్లాయపల్లె ఆశ్రమానికి సంబంధించి నిర్వాహకులు తమ భూమిని ఆశ్రమం పేరుపై ఆన్‌లైన్ చేయించాలని కోరారు. అక్రమ ఆన్‌లైన్, కబ్జాల విషయంపై పూర్తి స్థాయిలో నివేదికలను జిల్లా కలెక్టర్‌కు పంపిస్తాం. వారి ఆదేశాల మేరకు సమస్యను పరిష్కరిస్తాం.

– పుల్లారెడ్డి,
తహసీల్దార్, ఓబులవారిపల్లె

గోశాల ఏర్పాటు చేయడం అభినందనీయం

డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



గోశాలను ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజద్ బాషా

సిద్దవటం: మూగ జీవాలను కాపాడేందుకు రాజస్థాన్ సమాజ్ ఆధ్వర్యంలో గోశాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా తెలిపారు. సిద్దవటం మండలం కనుమలోపల్లె గ్రామ సమీపంలో వెలసిన శ్రీ ఉమాదేవి సహిత నీలకంఠేశ్వరస్వామి అష్టోత్తర(108) మహాశివలింగేశ్వర స్వామి ఆలయ ఆవరణలో రూ. 20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గోశాలను డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, వైఎస్ఆర్‌సీపీ సిద్దవటం మండల ఇన్‌చార్జి మేడా మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం గోవులకు దాణా తినిపించారు. అంతకు ముందు వేద పండితుడు కైలాష్‌శాస్త్రి పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు సోమాబాబు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏకుల రాజేశ్వరిరెడ్డి, వైఎస్ఆర్ సీపీ రైతు విభాగం మండల కన్వీనర్ పల్లె సుబ్బరామిరెడ్డి, తుర్రా ప్రతాప్, నాగం నరసింహారెడ్డి, రావుల సుబ్బారెడ్డి, కె. వెంకటరమణయ్య, మోహన్‌రెడ్డి, ఉత్తరామ్, రామ్‌సింగ్, శంభుసింగ్, భగవత్ సింగ్, దినేష్‌జైన్, అమృత్‌జైన్, జీవన్‌సింగ్, గణపతి జైన్ , తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం

- మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందజేత
- గాయపడ్డ వారికి పరామర్శ
- ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, ఆర్టీసీ చైర్మన్ ఎ.మల్లికార్జున రెడ్డి


మృతుడు జి.శ్రీనివాసులు కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల చెక్కు అందజేస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు


రాజంపేట ఏరియా హాస్పిటల్‌లో డ్రైవరును పరామర్శిస్తున్న ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి

ఓబులవారిపల్లె : రోడ్డు ప్రమాద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. మండల పరిధిలోని చిన్నఓరంపాడు వద్ద శనివారం ఆర్టీసీ బస్సును ట్యాంకర్ ఢీకొనడంతో ఐదుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుడు జి.శ్రీనివాసులు మృతదేహాన్ని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వారికి పది లక్షల రూపాయల చెక్కును అందజేశారు. అనంతరం ప్రభుత్వ విప్ మాట్లాడుతూ మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను, తీవ్రంగా గాయపడ్డ వారిని పరామర్శించామని తెలిపారు. వారికి ప్రభుత్వం ద్వారా అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వెంటనే స్పందించి ఇరవై నాలుగు గంటలలోపు మృతుల కుటుంబాలకు పది లక్షల రూపాయల చొప్పున పరిహారం మంజూరు చేశారని పేర్కొన్నారు. అంతకు ముందు రోడ్డు ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహామండలి జిల్లా అధ్యక్షులు పంజం సుకుమార్‌రెడ్డి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి సీ నాగేంద్ర, జిల్లా టూరిజం డైరెక్టర్ జీ సుధాకర్‌రాజు, మాజీ సర్పంచ్ ముక్కా రమేష్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ దుర్గాప్రసాద్, పార్టీ నాయకులు వంకన దుర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలి : చిన్నఓరంపాడు వద్ద జరిగిన ప్రమాదంలో చిట్వేలి మండలం దేవమాచుపల్లి పంచాయతీ దొగ్గలపాడు నివాసి చెవ్వు అమర్నాథరెడ్డి మృతి చెందాడు. మృతుడి స్వగృహానికి వెళ్లి ఆయన మృతదేహాన్ని ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సుకుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులు రెడ్డి, ఎల్‌వీ మోహన్‌రెడ్డి, సుధాకర్ రాజు, మహేశ్వరరెడ్డి, మలిశెట్టి వెంకటరమణ, ఇన్‌చార్జి ఆర్డీఓ రంగస్వామి, తహసీల్దార్ శిరీషా పాల్గొన్నారు.

సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఆర్టీసీ చైర్మన్

రాజంపేట : కడప-రేణిగుంట జాతీయ రహదారిలోని ఓబులవారిపల్లె మండలం చిన్నఓరంపాడు వద్ద రోడ్డు ప్రమాదం జరిగిన సంఘటన స్థలాన్ని ఆర్టీసీ చైర్మన్ ఎ.మల్లికార్జునరెడ్డి ఆదివారం పరిశీలించారు. అంతకు ముందు ఆయన రాజంపేట ఏరియా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బస్సు డ్రైవరు సీఎస్ మల్లేశును పరామర్శించారు. మృతి చెందిన కడప సబ్ రిజిస్ట్రారు శ్యామల భర్త కె.శేషాద్రి శేఖర్ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం రోడ్డు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రమాదం జరిగిన కొద్ది క్షణాల్లోనే అటు పోలీసు, ఇటు ఆర్టీసీ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని, యుద్ధప్రాతిపదకన సహాయక చర్యలు చేపట్టారన్నారు. మరి కొంత మందిని ప్రాణప్రాయం నుంచి కాపాడగలిగారన్నారు. సిమెంట్ ట్యాంకర్ డ్రైవర్ మద్యం మత్తులో నడపడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందన్నారు. ఆర్టీసీ డ్రైవర్ చాకచక్యంగా నడపడం వల్ల కొంత వరకు అయినా ప్రాణాలను కాపాడగలిగారన్నారు. మృతి చెందిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని పేర్గొన్నారు. మృతులకు ఎక్స్‌గ్రేషియా కింద రూ.10 లక్షలు, తీవ్రంగా గాయపడ్డవారికి రూ.2 లక్షలు, స్వల్ప గాయాలు అయిన వారికి రూ.50 వేలు ప్రభుత్వం అందజేస్తోందన్నారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన వారిలో వైఎస్సార్ జిల్లా డీపీటీవో గోపాల్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా డీపీటీఓ రాము, ఆర్టీసీ వీఅండ్ ఎస్‌వో ముజీబురు రెహమాన్, కడప డీఎం జిల్లేశ్వరరావు, రాజంపేట డీఎం రమణయ్య పాల్గొన్నారు.

కడప అర్బన్: చిన్నఓరంపాడు వద్ద జరిగిన ప్రమాదంలో గాయపడి కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న వారిని ఆర్టీసీ చైర్మన్ ఎ.మల్లికార్జునరెడ్డి పరామర్శించారు. బాధితులను ఓదార్చారు.

క్షతగాత్రులకు పరామర్శ

రాజంపేట రూరల్ : ఓబులవారిపల్లి మండలం చిన్నఓరంపాడు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రులను జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి సోదరుడు నియోజకవర్గ సీనియర్ నాయకులు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. స్థానిక ఏరియా ఆసుపత్రి వద్దకు వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆయన వచ్చారు. అనంతరం ప్రమాదంలో మృతి చెంది పోస్టుమార్టం గదిలో ఉన్న నందలూరు మండలం ఆడుపూరుకు చెందిన లక్ష్మయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కడపలో సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న శ్యామలాదేవి భర్త వెంకట

విచారణ కమిటీ నియామకం

రాజంపేట : ఓబులవారిపల్లె మండలం చిన్నఓరంపాడు సమీపంలో శనివారం బస్సును ఢీకొన్న లారీ సంఘటనపై విచారణకు ప్రత్యేక బృందంను ఏర్పాటు చేసింది. ఆదివారం ఈ బృందం సంఘటన స్థలంలో వివిధ కోణాల్లో పరిశీలన చేసి, విచారణ చేపట్టింది. ఈ బృందంలో అన్నమయ్య జిల్లా డీపీటీవో రాము, కడప వర్క్ మేనేజరు అజంతుల్లా, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీరు నరసంహులు (తిరుపతి) ఉన్నారు. ప్రమాదానికి గల కారణాలపై వీరు నివేదికను సమర్పించాల్సి ఉంటుంది. ప్రమాదం సంభవించిన పరిస్థితుల్లో అక్కడ నెలకొన్న తీరుతెన్నులపై ఆరా తీశారు. ఈ బృందం వెంట వైఎస్సార్ జిల్లా డీపీటీఓ గోపాల్‌రెడ్డి, డీఎం రమణయ్య, మల్లేశ్వరరావు ఉన్నారు.


శేషాద్రి శేఖర్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న అనిల్‌కుమార్‌రెడ్డి

రాజంపేటకు చెందిన కొమరావతి శేషాద్రి శేఖర్ మృతదేహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్సార్‌సీపీ నాయకులు బొల్లినేని రామ్మోహన్‌నాయుడు, పాపినేని విశ్వనాథరెడ్డి, దాసరి పెంచలయ్య, జొన్నల శేఖర్, లక్ష్మినారాయణ, రమణ పాల్గొన్నారు.

సత్వర సాంత్వన

రోడ్డు ప్రమాదంపై ప్రభుత్వం సత్వరం స్పందించి సాంత్వన చర్యలు చేపట్టింది. మృతులకు ఎక్స్‌గ్రేషియా కింద రూ.10 లక్షలు, తీవ్రంగా గాయపడ్డ వారికి రూ.2 లక్షలు, స్వల్ప గాయాలు అయిన వారికి రూ.50 వేలు ప్రకటించింది. ప్రమాదం జరిగిన 24 గంటల్లోపే వీరికి పరిహారం అందజేసేందుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అందజేస్తున్నారు. ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె అబ్బిరెడ్డిగారి మల్లికార్జునరెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. సంఘటన స్థలం సమీప నియోజకవర్గమైన రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి తిరుపతిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి, ఓదార్చారు. ప్రభుత్వం అండగా ఉంటుందని బాధిత కుటుంబ సభ్యులకు వారు ధైర్యం చెప్పారు. అన్ని విధాలుగా ఆదుకుంటుందని భరోసా కల్పించారు.

క్లుప్తంగా

పోలీసుల కార్డన్ సెర్చ్ ఆపరేషన్


కడప తాలూకా పరిధిలో తనిఖీలు చేస్తున్న సీఐ ఉలసయ్య

కడప అర్బన్ : ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు ఆదివారం కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. కడప నగరం టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నకాష్ కాలనీలో ఎస్ఐ సంజీవ రాయుడు తమ సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కడప తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఫ్రెండ్స్ కాలనీలో సీఐ ఉలసయ్య తమ సిబ్బందితో కలిసి కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా క్షుణ్ణంగా పరిశీలించారు. కడప రిమ్స్ పీఎస్ పరిధిలో బాబూ జగ్జీవన్‌రామ్ నగర్‌లో కార్డన్ సెర్చ్ ఆపరేషన్‌ను ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి నిర్వహించారు. తనిఖీల్లో రికార్డులు లేని రెండు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే పోలీసులకు సమాచారం అందించాలని స్థానికులకు రిమ్స్ ఎస్ఐ సూచించారు.

రైలు ఢీకొని వృద్ధురాలికి తీవ్ర గాయాలు


రైల్వే ట్రాక్‌పై పడి ఉన్న నాగమ్మ

కమలాపురం : స్థానిక రైల్వేగేటు సమీపంలో పట్టణంలోని గిడ్డంగి వీధికి చెందిన నాగమ్మ(75) రైలు ఢీకొని తీవ్రంగా గాయపడింది. ఈమెకు కొంత కాలంగా మతిస్థిమితం లేదు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా నడుచుకుంటూ రైల్వే గేటు వద్దకు చేరుకుంది. రైల్వే ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొని తలకు తీవ్ర గాయాలయ్యాయని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమెను 108 వాహనంలో చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

రైతుకు పాము కాటు

తంబళ్లపల్లె : వ్యవసాయ బోరు వద్ద ఓ రైతుకు పాము కాటు వేసిన సంఘటన ఆదివారం జరిగింది. బాధితుని కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ములకలచెరువు మండలం చౌడసముద్రం పంచాయతీ చుంచువారిపల్లెకు చెందిన క్రిష్ణప్ప(59) బోరు మోటారు వదిలి గేట్‌వాల్ తిప్పేందుకు వెళ్తుండగా గడ్డిలో ఉన్న పాము కాలికి కాటు వేసింది. కుటుంబీకులు హుటాహుటిన ఆటోలో తంబళ్లపల్లె వైద్య విధాన పరిషత్ ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. డాక్టర్ తేజశ్వి వైద్య చికిత్స చేసి మెరుగైన వైద్యంకోసం మదనపల్లె జిల్లా ఆసుపత్రికి రెఫర్ చేయగా 108 సిబ్బంది అనురాధ, ఓబుల్‌రెడ్డిలు తరలించారు.

భక్తిభావం అలవర్చుకోవాలి


శ్రీ బాల బ్రహ్మానంద సరస్వతీ స్వామితో గంగమ్మ ఆలయ కమిటీ

లక్కిరెడ్డిపల్లి : ప్రతి ఒక్కరూ భక్తిభావం అలవరుచుకోవాలని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నైమిశారణ్య పీఠాధిపతి శ్రీ బాల బ్రహ్మనంద సరస్వతీ స్వామి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని శ్రీ అనంతపురం గంగమ్మ దేవత ఆలయాన్ని ఆయన దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీదేవి భాగవత అంతర్గత గంగమ్మ దేవత తత్వం, ధ్యానంపై ఉపన్యాసం ఇచ్చారు. హిందూ ధర్మాన్ని కాపాడే బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. ప్రతి వ్యక్తి ఆధ్యాత్మిక చింతన, హిందూ సంప్రదాయ పద్ధతులు, విఘ్నాలు అలవరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సామాల నరసింహారెడ్డి, కార్య నిర్వహణ అధికారి రవీంద్రరాజు, ఆలయ ధర్మకర్తలు గంగయ్య, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

రవీంద్రనగర్‌లో పరస్పరం దాడి

కడప అర్బన్ : కడప నగరం తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని రవీంద్రనగర్‌లో ఆదివారం పరస్పరం దాడులు చేసుకున్నారు. బిల్టప్ సమీపంలోని పుత్తా ఎస్టేట్‌లో పిల్లల క్రికెట్ ఆటలో స్వల్పంగా జరిగిన గొడవ చినికిచినికి గాలివానగా మారింది. పిల్లలు తమ తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పరస్పరం గొడవ పడ్డారు. దగ్గరలోని పాలప్యాకెట్ల బాక్సులతో పరస్పరం దాడి చేసుకుని గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. గాయపడ్డవారిని కడప రిమ్స్ ఆసుపత్రికి పంపించారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన రవీంద్రనగర్‌పై పోలీసులు మరింత గట్టి నిఘా ఏర్పాటు చేసి, వాటిని నిర్మూలించేందుకు కృషి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఉత్సాహంగా అండర్-19 క్రికెట్ టోర్నీ


అర్జున్ టెండూల్కర్, (57 పరుగులు)


అస్లాం, (5 వికెట్లు)

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ-సౌత్‌జోన్ అంతర్ జిల్లాల అండర్-19 మల్టీ డేస్ క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగుతోంది. ఆదివారం వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో అనంతపురం, నెల్లూరు జట్లు తలపడ్డాయి.

టాస్ గెలిచిన నెల్లూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 65.2 ఓవర్లలో 278 పరుగుల వద్ద నెల్లూరు జట్టు ఆలౌట్ అయింది. జట్టులోని చైతన్యతేజ 50 పరుగులు చేశాడు. అనంత బౌలర్లు ప్రదీప్‌రెడ్డి 4, లోహిత్‌సాయికిశోర్ 3 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 17 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 86 పరుగులు చేసింది. జట్టులోని పి. అర్జున్‌టెండూల్కర్ 36 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 57 పరుగులతో నాటౌట్‌గా నిలువగా, వీరారెడ్డి 23 పరుగులతో క్రీజులో ఉన్నారు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

రాణించిన కడప బౌలర్లు

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మరో మ్యాచ్‌లో కడప, కర్నూలు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కర్నూలు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 39.2 ఓవర్లలో కర్నూలు జట్టు 128 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని గణేష్ 34 పరుగులు చేశాడు. కడప బౌలర్లు ఎస్ఎండీ అస్లాం 5, సాయి ఆర్థిత్‌రెడ్డి 5 వికెట్లు తీశాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 35.2 ఓవర్లలో 183 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని మహ్మద్ అస్లాం 49 పరుగులు, రోహిత్‌వర్మ 46 పరుగులు చేశాడు. కర్నూలు బౌలర్ సాయిసూర్యతేజారెడ్డి 5 వికెట్లు తీశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 12 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 53 పరుగులు చేసింది. జట్టులోని నయీముల్లా 21 పరుగులతో క్రీజులో ఉన్నాడు. కడప బౌలర్లు ఎస్. మస్తాన్ 2 వికెట్లు తీశాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

వైద్యుల రక్షణ చట్టాన్ని పటిష్టం చేయాలి


మాట్లాడుతున్న స్టేట్ ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ రవికృష్ణ

ప్రొద్దుటూరు క్రైం : రాష్ట్రంలో వైద్యుల రక్షణ చట్టాన్ని పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని ఐఎంఏ స్టేట్ ప్రెసిడెంట్ డాక్టర్ రవికృష్ణ తెలిపారు. ప్రొద్దుటూరులోని ఐఎంఏ హాల్‌లో ఆదివారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఆస్పత్రులపై భౌతిక దాడులు దేశవ్యాప్తంగా పెరిగాయన్నారు. దీంతో వైద్యులు స్వేచ్ఛగా, నిర్భయంగా వైద్య సేవలు అందించలేక పోతున్నారని పేర్కొన్నారు. గతంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2008లో దేశంలోనే మొదటి సారిగా ఆస్పత్రులు, వైద్యులపై దాడుల నిరోధానికి చట్టం తెచ్చారన్నారు. తర్వాత ఈ చట్టాన్ని 16 రాష్ట్రాల్లో అమలు చేసినట్లు తెలిపారు. ఈ చట్టం ప్రకారం నేరారోపణ రుజువైతే మూడేళ్ల జైలు శిక్ష విధించేవారన్నారు. అయితే ప్రస్తుతం ఏడేళ్ల కనీస కారాగార శిక్ష ఉన్న వారిపై మాత్రమే నాన్‌బెయిలబుల్ అరెస్ట్ చేయడానికి అవకాశం ఉందన్నారు. ఈ చట్టంలో మార్పులు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇటీవల కేరళ రాష్ట్రంలో యువ వైద్యురాలు వందనాదాస్ హత్యకు గురైన నేపథ్యంలో.. ప్రస్తుతమున్న ఆ రాష్ట్ర వైద్య రక్షణ చట్టాన్ని కఠినతరం చేస్తూ గత నెలలలోనే చట్ట సవరణ చేశారన్నారు. అలాగే ఆస్పత్రుల్లో రోగులు చనిపోయిన సందర్భాల్లో వైద్యులపై కేసు నమోదుకు నిర్దిష్టమైన నియమావళిని రూపొందించాలని పేర్కొన్నారు. ముగ్గురు వైద్య నిపుణుల కమిటీ ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని నిర్ధారించిన తర్వాత మాత్రమే కేసులు నమోదు చేయాలని తెలిపారు. రాష్ట్రంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేస్తూ ఆరోగ్యశ్రీ పరిధిని మరింత విస్తృతం చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఏఎంఏ తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. 20 పడకల ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీని వర్తింప చేయాలని కోరారు. సమావేశంలో ఐఎంఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ విజయ్‌భాస్కర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌వీకే ప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర వర్కింగ్ సభ్యుడు డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ త్యాగరాజరెడ్డి, ప్రొద్దుటూరు ఏఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ ఈశ్వరరెడ్డి, కార్యదర్శి హరీష్‌కుమార్, వరుణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 12 గొర్రెల మృతి


మృతి చెందిన గొర్రెలు

బి.కొత్తకోట : అర్ధరాత్రి దాటిన తర్వాత గొర్రెల మందలోకి కుక్కల గుంపు వెళ్లి కొరికి చంపాయి. ఈ సమయంలో యజమాని రావడంతో నష్టం తగ్గింది. బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బి.కొత్తకోట నగర పంచాయతీ డేగానిపల్లెకు చెందిన జె.కిట్టన్న గొర్రెలను మేపుకొంటూ జీవిస్తున్నాడు. శనివారం రాత్రి పొలిమేరలోని కంచెలోకి గొర్రెలను పంపి, అక్కడే నిద్రించాడు. చినుకులు కురుస్తుండటంతో సమీపంలోని ఇంటికి వెళ్లి పడుకున్నాడు. ఆదివారం తెల్లవారుజాము రెండు గంటల సమయంలో గొర్రెలను చూసేందుకు కిట్టన్న ఇంటి నుంచి మంద దగ్గరకు వచ్చాడు. అప్పటికే కుక్కల గుంపు మందలోకి వెళ్లి గొర్రెలను కొరికి చంపుతున్నాయి. వాటిని అరచి బయటకు వెళ్లేలా చేశాడు. అప్పటికే 12 గొర్రెలు మృతి చెందగా, మరో మూడు గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. గొర్రెల మృతితో రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

మహిళ అదృశ్యం

సంబేపల్లె : మండల పరిధిలోని మోటకట్ల ఎస్టీ కాలనీకి చెందిన కుమ్మా శిల్పా(24) అదృశ్యమైనట్లు ఎస్ఐ ఎస్ఎండీ షరీఫ్ ఆదివారం తెలిపారు. శనివారం రాత్రి నుంచి కనిపించడం లేదని ఆమె తల్లి సరస్వతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కస్తూర్బాలో విద్యార్థినికి అస్వస్థతపై ఆందోళన


విద్యార్థినితో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

బ్రహ్మంగారిమఠం : మండలంలోని మద్దిరెడ్డిపల్లె సమీపంలో ఉన్న కస్తూర్బా బాలికల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న అభిషా వాష్‌రూమ్‌లో కింద పడి అస్వస్థతకు గురైనా ప్రిన్సిపాల్ స్పందించలేదని ఎస్ఎఫ్ఐ నాయకులు ఆరోపించారు. పోరుమామిళ్ల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అభిషాను వారు పరామర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ అభిషా శనివారం రాత్రి నుంచి అస్వస్థతకు గురైనా కనీసం వారి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వలేదన్నారు. ఆదివారం అభిషా తల్లి పాఠశాలకు కుమార్తెను చూడడానికి వస్తే.. అప్పటికే అస్వస్థతకు గురై పలకలేని స్థితిలో ఉన్న కుమార్తెను చూసి వెంటనే పోరుమామిళ్ళలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకుపోయారన్నారు. బాలిక పరిస్థితి విషమంగా ఉండడంతో డాక్టర్ల సూచనల మేరకు కడప రిమ్స్‌కు తరలించారన్నారు. ఇప్పటికైనా అధికారులు కస్తూర్బా బాలికల ఉన్నత పాఠశాలను పరిశీలించి నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీరభోగు రవి, సునీల్, రాహుల్, సుమంత్ పాల్గొన్నారు.

లారీ టైరు పగిలి.. బస్సును ఢీకొని..


ఆళ్ల అజయ్‌బాబు మృతదేహం


ఆర్టీసీ బస్సు వెనుక చక్రాలు పక్కకు పడిన దృశ్యం


నుజ్జునుజ్జు అయిన లారీ

ఒకరి మృతి, నలుగురికి గాయాలు

కొండాపురం : లారీ టైరు పగిలి అదుపుతప్పి.. ఆర్టీసీ బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి చెందగా, బస్సులోని నలుగురు ప్రయాణికులు గాయాల పాలయ్యారు. ఈ సంఘటన కొండాపురం మండలం వెంకటాపురం పరిధి సాయిబాబా గుడి దగ్గరలోని జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బళ్లారి నుంచి విజయవాడకు వెళ్తున్న లారీ (ట్యాలీ ట్రక్) కొండాపురం మండలం వెంకటాపురం సాయిబాబా గుడి సమీపంలోని జాతీయ రహదారి పైకి రాగానే ముందు టైరు పగిలింది. అదుపు తప్పి ఎదురుగా వస్తున్న తాడిపత్రి వైపు వెళ్లే ఆర్టీసీ బస్సును ఢీకొంది. లారీ ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. ఆర్టీసీ బస్సు వెనుక చక్రాలు ఊడిపోయి పక్కకు వచ్చి పడ్డాయి. లారీ డ్రైవర్ ఆళ్ల అజయ్‌బాబుకు తీవ్ర, బస్సులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్ప గాయాలు అయ్యాయి. వీరిని 108 వాహనంలో తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ లారీ డ్రైవర్ మృతి చెందాడు. మృతుడిది ఎన్టీఆర్ జిల్లా మండలం ఇబ్రహీంపట్నం మండలంలోని మూలపాడు గ్రామం. పులివెందులకు చెందిన మనశ్రీని మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ మోహన్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చెన్నరాయునిపల్లిలో ఆర్టీఐ రాష్ట్ర కమిషనర్

పెద్దతిప్పసముద్రం : టి.సదుం పంచాయతీలోని చెన్నరాయునిపల్లికి సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) రాష్ట్ర కమిషనర్ కాకర్ల చెన్నారెడ్డితోపాటు కుటుంబ సభ్యులు విచ్చేశారు. రాష్ట్ర లోకాయుక్తా జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి సోదరి పుల్లారెడ్డిగారి శకుంతలమ్మ (87) అనారోగ్యంతో ఈ నెల 13న మృతి చెందారు. ఆదివారం చెన్నరాయునిపల్లిలో జరిగిన వైకుంఠ సమారాధనకు పలువురు ప్రముఖులు వచ్చారు. ఆర్టీఐ కమిషనర్‌తోపాటు ఐఆర్‌టీఎస్ అధికారి రఘునాథ్‌రెడ్డి, వినియోగదారుల ఫోరం చైర్మన్ కిషోర్ కుమార్, రాయలసీమ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ అధినేత కొండారెడ్డి, సజ్జల జనార్దన్‌రెడ్డి, విశ్రాంత న్యాయమూర్తి బాలక్రిష్ణారెడ్డి, తహసీల్దార్ విద్యాసాగర్, లోకాయుక్తా సెక్రటరీ అమరేంద్రరెడ్డి, బీజేపీ నాయకుడు చల్లపల్లి నరసింహారెడ్డి, తంబళ్ళపల్లి మాజీ ఎమ్మెల్యే ఏవీ.లక్ష్మీదేవమ్మ, ఏఎంసీ మాజీ చైర్మన్లు పి.శ్రీనాథ్‌రెడ్డి, ఎంఎస్ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త జయచంద్రారెడ్డి, సర్పంచ్‌లు సుబ్బిరెడ్డి, శారదతోపాటు పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధులు, నాయకులు విచ్చేశారు. వారు శకుంతలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం లోకాయుక్తా జస్టిస్ పి.లక్ష్మణరెడ్డిని పరామర్శించారు.